జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 24 | మార్చి | 2026 ◆ పేజీలు : 8

# రామయ్య కల్యాణం, పట్టాభిషేకానికి గవర్నర్‌కు ఆహ్వానం



**భద్రాచలం, మార్చి 23, ప్రజాజ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం మరియు శ్రీరామ మహా పట్టాభిషేకాలను తిలకించేందుకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాదులో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాజపత్రాన్ని అందజేశారు. ముందుగా వైదిక సిబ్బంది

మిగతా 2 లో...




8 లో..

# ట్రాఫిక్ తో నిత్యం... రద్దీనే..!

- రోడ్డును ఆక్రమిస్తున్న కూరగాయల బండ్లు...
- వ్యాపార సముదాయాలున్న రోడ్డుమీదనే అమ్మకాలు
- ఇబ్బందులు పడుతున్న వాహన దారులు...

ఇక్కడ అసలే ట్రాఫిక్ సమస్య ఆ పై ఉన్న రోడ్డున సైతం తోపుడుబండ్ల పై వ్యాపారాలు చేసేవారు ఆక్రమించడంతో ప్రతి రోజు ఆ ప్రాంతంలో తీవ్రట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రపురం వెళ్లే ప్రధాన రహదారి రద్దీగా మారుతుంది అదేవిధంగా కొత్తగూడెం చిన్న బజార్ పెద్ద బజారుకు వెళ్లేవారు కూడా ఇదే మార్గంలో వెళ్లడం పెద్ద బజారుకు సరుకులు తీసుకొచ్చే లారీలు కూడా ఎటువైపు నుంచి వెళుతుండడం ఇతర భారీ వాహనాలు ర్యాలీలు ఆటోలు ఇలా అన్ని వాహనాలు ఇదే దారిలో వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

● లక్ష్మీదేవిపల్లి, ప్రజాజ్యోతి

# ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి...

- ఘనంగా కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్...




5 లో...

## శ్రీరామనవమి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్



2 లో...

# గిరిజన మహిళలకు ఆదరణగా 'భద్రగిరి మార్ట్'



- మధ్యదళారుల జోక్యం లేకుండా నేరుగా విక్రయాలకు అవకాశం: కలెక్టర్ అంకిత్

**భద్రాచలం, మార్చి 23, ప్రజాజ్యోతి:** ఆదివాసి స్వయం సహాయక సంఘాల మహిళలు, చిన్నతరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న మహిళలు, గిరిజన రైతులు తమ ఉత్పత్తులను మధ్యదళారుల జోక్యం లేకుండా నేరుగా వినియోగదారులకు అందించే వేదికగా 'భద్రగిరి మార్ట్' ఏర్పాటు చేయడం అభినందనీయమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భద్రగిరి మార్ట్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మార్ట్‌లో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు, సహజ పద్ధతిలో తయారు చేసిన ఉత్పత్తులు, పిండి పదార్థాలు, తృణ ధాన్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన మహిళలు, రైతులు, స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులను నాణ్యతతో తయారు చేసి ఈ మార్ట్ ద్వారా మార్కెట్‌ను విస్తరించుకోవడానికి ఇది మంచి అవకాశం అని తెలిపారు. వినియోగదారులు

మిగతా 2 లో...

## గిరిజన మహిళలకు ఆదరణగా 'భద్రగిరి మార్ట్'



(మొదటి పేజీ తరువాయి... )

భద్రగిరి మార్ట్‌ను సందర్శించి కల్తీ లేని సహజ ఉత్పత్తులను సరసమైన ధరలకు కొనుగోలు చేయాలని, తద్వారా గిరిజన మహిళలకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ, గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు, రైతులు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీలు, చాక్లెట్లు, కరక్కాయ పొడి, కారంపొడి ప్యాకెట్లు, తేనె, తృణధాన్య బిస్కెట్లు, గానుగ నూనెలు, బియ్యం, వివిధ రకాల పప్పుదినుసులు, బొబ్బర్లు, నువ్వులు, కొర్రలు, సజ్జలు తదితర నిత్యావసర సరుకులు మార్ట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, విద్యుత్ విభాగం సహాయ ప్రాజెక్టు అధికారి వేణు, ప్రత్యేకంగా వెనుకబడిన గిరిజనుల అధికారి గన్యా, ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్ కుమార్, గిరిజన సంక్షేమ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ మధుకర్, సహాయ సివిల్ శస్త్రచికిత్సాధికారి రమేష్, ఉప ఇంజినీర్ హరీష్, వ్యవసాయ అధికారి రాంబాబు, జిల్లా సరఫరా అధికారి ప్రభాకర్ రావు, సంయుక్త మార్కెటింగ్ అధికారి హరికృష్ణ, తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, గిరిజన సహకార సంస్థ మేనేజర్ జయరాజ్, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య కల్యాణం, పట్టాభిషేకానికి గవర్నర్‌కు ఆహ్వానం



(మొదటి పేజీ తరువాయి... )

వేద ఆశీర్వచనం అందించగా, అనంతరం మంత్రి సురేఖ గవర్నర్‌కు శాలువా, స్వామివారి ప్రసాదం మరియు జ్ఞాపికను అందజేశారు. తర్వాత అధికారికంగా రాజపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, రామాయణ పారాయణదారులు ఎస్టీజి అంతర్వేది కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలు పగడ్బందీగా నిర్వహించాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్



**భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి:** ఈనెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం, 28న నిర్వహించనున్న మహా పట్టాభిషేక కార్యక్రమాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 27న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భూమిపూజకు సంబంధించిన శిలాఫలక ఏర్పాట్లు ఈనెల 25 నాటికి పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్టమైన భద్రత, రవాణా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక పాసులు జారీ చేసి పరిమిత సంఖ్యలోనే వ్యక్తులను అనుమతించాలని ఆదేశించారు. దేవాలయ స్థానాచారులతో సంప్రదించి శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిమిషానిమిషం ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ముఖ్యమంత్రి దర్శనం అనంతరం భూమిపూజ పూర్తి చేసి, అనంతరం మిథిలా స్టేడియంలో జరిగే కల్యాణ మహోత్సవానికి హాజరయ్యేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీఐపీలు, వీవీఐపీలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ప్రత్యేక లైజన్ అధికారులను నియమించాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రముఖులకు భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు పాత్రికేయుల సమావేశం నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం కల్యాణం అనంతరం తలంబ్రాల కోసం భక్తులు మండపంపైకి చేరే పరిస్థితులు ఉండటంతో, ఈసారి అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం భూముల వివరాలు, సమస్యలు, పట్టణానికి సంబంధించిన కీలక అంశాలపై సమగ్ర సమాచారం సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం, భూమిపూజ కార్యక్రమాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే వేడుకలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అంశాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మిథిలా స్టేడియం, ఆలయ పరిసరాల్లో జన సమ్మర్థాన్ని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లు, ప్రత్యేక ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేస్తున్నామని, పోలీసు శాఖతో సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీఐపీలు, వీవీఐపీలకు అవసరమైన సౌకర్యాల కోసం ప్రత్యేక బృందాలను నియమిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖలన్నీ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, కార్యక్రమాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేసి శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ప్రధాన ప్రణాళిక అధికారి సంజీవరావు, దేవస్థాన కార్యనిర్వాహక ఇంజినీర్ రవీందర్, తహసీల్దార్ వెంకటరమణ, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలను వెంటనే సీజ్ చేయాలి

- ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్డిఓ)కు తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల వినతిపత్రం



**మణుగూరు, మార్చి 23, (ప్రజాజ్యోతి) :** పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండల పరిధిలో అక్రమ అటవీ కలప ఉపయోగిస్తూ నిర్వహిస్తున్న సుమారు డెబ్భై ఇటుక బట్టీలను అటవీ చట్టాల ఉల్లంఘన క్రింద వెంటనే సీజ్ చేయాలని సోమవారం మణుగూరు అటవీ శాఖ డివిజనల్ అధికారికి తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలెం కోటి, ఆదివాసీ ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర మాట్లాడారు. అశ్వాపురం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళలో సీతారాంపురం, గొందిగూడెం, తుమ్మల చెరువు, జగ్గారం తదితర గ్రామాల్లో అటవీ కలపను ఉపయోగిస్తూ ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారన్నారు. వీటి వల్ల కోట్లాది రూపాయల అటవీ కలపను తరలిస్తున్నారని తెలిపారు. అటవీ హద్దుల పరిధిలో ఇటుక బట్టీలను నిర్వహిస్తూ అటవీ సంపదను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకబట్టీలన్నింటికి అటవీ కలపను అక్రమంగా తరలిస్తున్న వాటిని వెంటనే సీజ్ చేయాలని ఎఫ్డిఓను కోరామని తెలిపారు. ఇందుకు ఎఫ్డిఓ సానుకూలంగా స్పందిస్తూ అక్రమ కలప రవాణా చేస్తున్న వారిని నివారిస్తామని అలాగే అటవీ హద్దుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను సీజ్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి మధు తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, గుమ్మడి రామ్ కుమార్ తుడుందెబ్బ జిల్లా నాయకులు, పాయం సూరయ్య తదితరులు ఉన్నారు.

## ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- రామాలయ అభివృద్ధితోపాటు కరకట్ట పునర్ నిర్మాణ పనులు చేపట్టాలి
- భద్రాచలం నుండి వెంకటాపురం వరకు రహదారుల నిర్మాణానికి నిధులను విడుదల చేయాలి
- విలేకర్ల సమావేశంలో సమావేశంలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

**భద్రాచలం, మార్చి 23 , ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణాన్ని పోలవరం ముంపు నుండి కాపాడేందుకు కరకట్ట పున నిర్మాణ పనులను వెంటనే చేపట్టి , భద్రత కల్పించాలని ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ సమావేశాలలోనే ఐదు గ్రామపంచాయతీల విలీనంపై తీర్మానం చేసి భద్రగిరి అభివృద్ధికి భరోసా కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం కరకట్ట పునర్ నిర్మించి శాశ్వత పరిష్కారాన్ని చెప్పకపోతే రామాలయం చుట్టూ చేసే అభివృద్ధి బూడిదలో పోసిన పన్నీరు గానే మిగిలిపోతుందని, వెంటనే కరకట్ట పునర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని, రామాలయ అభివృద్ధికి ఒకే దశలో నిధులను విడుదల చేసి అభివృద్ధి చేయాలన్నారు. భద్రాచల పట్టణ సుందరీకరణకు రూ.580 కోట్ల రూపాయల ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో ఒకేసారి మొత్తం నిధులను విడుదల చేసి ఆలయ అభివృద్ధిపై నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. మొదటి దశ పనులలోనే భద్రాచలం పట్టణ సుందరీకరణ పనులను సైతం చేపట్టాలన్నారు. అలాగే మాడవీధుల అభివృద్ధి కోసం తమ నివాస భూములను వ్యాపార సముదాయాలను కోల్పోయిన పేదలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద అధికారులు హామీ ఇచ్చిన ప్రకారం ఇంటి స్థలాలను శ్రీరామనవమి రోజునే పంపిణీ చేయాలన్నారు. ఆరు సంవత్సరాలుగా భద్రాచలం కేంద్రంగా ఇసుక రీచ్ ప్రారంభం కాకపోవటానికి ప్రధానంగా అధికార పార్టీకి చెందిన నాలుగు వర్గాలు నాలుగు గిరిజన సొసైటీలను నమోదు చేసుకోవడమేనని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మంత్రులు జోక్యం చేసుకొని భద్రాచలం కేంద్రంగా ప్రభుత్వ ఇసుక రీచ్ ను ప్రారంభించి పట్టణ ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలి. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వలసపోయే పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు ప్రభుత్వమే పరిష్కారం చూపించాలి. భద్రాచలం నుండి వెంకటాపురం వరకు రోడ్డు ల మరమ్మతులు చేపట్టాలని, ఆంధ్రలో కలిపేసిన ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో విలీనం చేస్తేనే భద్రాచలం అభివృద్ధికి భరోసా కలుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ ఎంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న నేపథ్యంలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఐదు పంచాయతీల తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం సంధించిన అన్ని అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. అంతేకాకుండా భద్రాచలంలో నెలకొన్న సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవచూపి సిపిఎం బృందాన్ని ముఖ్యమంత్రికి కల్పించాలని మచ్చ పాత్రికేయుల సమావేశంలో కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి పాల్గొన్నారు.



# ఎర్రగుంటలో ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహణ

- * ప్రకృతి సంరక్షణే భవిష్యత్ భద్రత
- * విద్యార్థుల్లో అవగాహనకు వినూత్న కార్యక్రమాలు







**అన్నపురెడ్డిపల్లి, మార్చి 23, ప్రజా జ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించాలనే లక్ష్యంతో పాఠశాల ఉపాధ్యాయులు ఘంటాడి సుశీల, మోతుక్కూరి పద్మ, పసుపులేటి వసంత, నువ్వుల ప్రమీల, బొర్రా ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్లోబల్ తాపన, వర్షపాతం మార్పులు, శీతోష్ణ స్థితి ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో పవన దిశా సూచికలు, వర్షపాతం కొలిచే పరికరాలను తయారు చేయించి వాటి ఉపయోగాన్ని వివరించారు. ఉష్ణోగ్రతలు కొలిచే విధానం, వర్షపాతం అంచనా పద్ధతులను సులభంగా అర్థమయ్యేలా బోధించారు. భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఉపగ్రహాలు, రాడార్ వ్యవస్థలు, వాతావరణ కేంద్రాల ద్వారా సేకరించే సమాచారం ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేయడంలో కీలకమని తెలిపారు. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సునంద రెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, బాలు, మోతీలాల్, జయరాం, మీరా సాహెబ్, శిరీష, నాగమణి, వెంకటరమణ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ అవసరం


- యస్&పిసి సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణా తరగతులు ప్రారంభం



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 23 – ప్రజాజ్యోతి:** ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని ఏరియా సెక్యూరిటీ అధికారి / ట్రైనింగ్ అధికారి యం. డి జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవరం నుంచి 29 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజుల పాటు జరుగు 41వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ & ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరుగుతుందని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, మరియు భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరుగుతుందని, మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. నారాయణ రెడ్డి, ట్రైనింగ్ ఇన్స్పెక్టర్, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రంగాపురంలో క్షుద్ర పూజల కలకలం

- ప్రాథమిక పాఠశాల గేట్ ఎదురుగా నిమ్మకాయలు, కొబ్బరికాయలు, బొగ్గు కనిపించడంతో స్థానికుల్లో భయాందోళన



**పాల్వంచ, మార్చి 23, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రంగాపురం గ్రామంలో క్షుద్ర పూజల అనుమానం కలకలం రేపింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల గేట్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే నిమ్మకాయలు, బొగ్గు, కొబ్బరికాయలు తదితర వస్తువులను వింతగా అమర్చి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సోమవారం ఉదయం పాఠశాల వద్దకు వచ్చిన స్థానికులు గేట్ ఎదుట ఈ వస్తువులు కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు దీనిని క్షుద్ర పూజలుగా భావిస్తుండగా, మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలో ఈ తరహా ఘటన చోటుచేసుకోవడం పట్ల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రాజబలి నగర్ అటవీ ప్రాంతంలో క్షయ వ్యాధి గుర్తింపు శిబిరం

- * అటవీ ప్రాంత గిరిజనులకు ప్రత్యేక వైద్య సేవలు
- * చిన్నారులకు టీకాలు, రోగులకు మందుల పంపిణీ



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 23, ప్రజా జ్యోతి:** పెద్దరెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని రాజబలి నగర్ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న వలస గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్షయ రహిత దేశం లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య బృందం సోమవారం గ్రామాన్ని సందర్శించి సేవలు అందించింది. సుదూర అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక పరికరాలను తీసుకెళ్లి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించి తక్షణ నిర్ధారణ చేయడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించడమే ప్రధాన లక్ష్యమని వైద్యురాలు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. గిరిజన చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి , హెల్త్ సూపర్వైజర్ ప్రకాశరావు, సాంకేతిక నిపుణుడు సాయి, క్షయ పర్యవేక్షకుడు వెంకట్, ఆరోగ్య కార్యకర్తలు ప్రేమలత, జ్యోతి, ఆశా కార్యకర్తలు సీతమ్మ, లక్ష్మి , లలితపాల్గొని సేవలందించారు. గ్రామ ప్రజలు వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# నేషనల్ టాలెంట్ సెర్చ్‌లో పాల్వంచ శ్రీ చైతన్య విద్యార్థుల ఘన విజయం

- రెండో స్థాయి పరీక్షల్లో 83 మంది ఉత్తీర్ణత.. విజేతలకు ఘన సన్మానం



**పాల్వంచ, మార్చి 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు 'ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్' పరీక్షల్లో విశిష్ట ప్రతిభ కనబరిచారు. జనవరిలో నిర్వహించిన రెండో స్థాయి పరీక్షల్లో పాఠశాలకు చెందిన మొత్తం 83 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు యాజమాన్యం వెల్లడించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అభినందన కార్యక్రమంలో రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ శ్రీ కొండబోయిన వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఆయన కొనియాడారు. ఈ పోటీల్లో పి. మహతి, ఆర్. తన్మయి ద్వితీయ బహుమతిగా స్మార్ట్‌వాచ్‌లు అందుకోగా, మోరపాక భువనేష్, అనన్య తృతీయ బహుమతులు సాధించారు. అలాగే జస్వంత్ చౌదరి, జాషువా జోయల్, ప్రియాంక్, గీతిక, వర్ష తదితరులు వివిధ విభాగాల్లో మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మిర్యాల, ఏజీఎం జయప్రకాష్, ఇన్‌చార్జ్‌లు విద్యార్థులను అభినందిస్తూ, జాతీయ స్థాయి పోటీల్లో ఇంతటి ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇదే తపనతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గడువు కంటే ముందే బొగ్గు డిస్పాచ్ లక్ష్య సాధన



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 23 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియా లో ఆర్‌సిహెచ్‌పి ద్వారా జరిగిన బొగ్గు రవాణా నిర్దేశించిన 49.50 లక్ష టన్నుల డిస్పాచ్ లక్ష్యాన్ని ఆదివారం నాటికి మొత్తం 50.15 లక్ష టన్నుల బొగ్గు డిస్పాచ్ చేసి, నిర్దేశించిన గడువుకంటే ముందుగానే లక్ష్యాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఎం. షాలెం రాజు మాట్లాడుతూ.... ఈ ఘనత సాధనలో కీలక పాత్ర పోషించిన అధికారులకు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపి వారి ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా సమిష్టి కృషితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు ఏరియా ఇంజనీర్ కే.ఎస్.ఎన్. రాజు , ఎస్.ఇ (ఈ అండ్ ఎం) అజ్మీరా శ్రీనివాస్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఘట్టయ్య, ఇతర సంబధిత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ వర్ధంతి

**బూర్గంపహాడ్, మార్చి 23 (ప్రజా జ్యోతి ):** కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల పరిధిలోని సారపాక ఐటీసీ గేటు వద్ద సోమవారం చేపట్టిన రిలే నిరాహారదీక్షా శిబిరం వద్ద కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భగత్సింగ్ వర్ధంతిని కార్మికులు నిర్వహించారు. కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో–కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్యలతో పాటు జేఏసీ నాయకులు భగత్సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిరు ప్రాయంలోనే ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకుని భగత్సింగ్ అడుగుజాడల్లో నడుస్తూ కార్మికుల హక్కులను సాధించుకుంటామన్నారు. జేఏసీ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



## 108 అంబులెన్స్ సేవలపై దానోజుల మనోహర్ ఆకస్మిక తనిఖీ

- * అన్నపురెడ్డిపల్లిలో వాహనం, పరికరాలు, సిబ్బంది పనితీరుపై సమగ్ర తనిఖీ
- * ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాణదాతలుగా 108 అంబులెన్స్ సేవలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 23,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్ వాహనాన్ని భద్రాచలం డివిజన్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ దానోజుల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలో అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, మందులు, వాహనం ఫిట్‌నెస్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు తెలియజేసిన మనోహర్, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తూ సేవలు అందించాలని సూచించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు ప్రాణాధారంగా నిలుస్తున్నాయని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను సమయానికి ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు.అన్నపురెడ్డిపల్లి 108 సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తూ అత్యవసర సేవలు అందిస్తున్నారని ఆయన అభినందించారు. అంబులెన్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉండి 24 గంటల పాటు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా, అంబులెన్స్ వాహనాల నిర్వహణ ఎల్లప్పుడూ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనుభవజ్ఞులైన సిబ్బంది, సమర్థవంతమైన వాహనాల ద్వారా సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ఈ తనిఖీతో సేవల నాణ్యత మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు

## పి.వి.టి.జి కుటుంబాల సర్వేకు సిద్ధం కావాలి

- ఏప్రిల్ 2026 నాటికి పూర్తి చేయాలి: కేంద్ర అదనపు కార్యదర్శి



**భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి:**ఆదివాసి గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న ప్రత్యేకంగా బలహీన గిరిజన వర్గాల కుటుంబాల వివరాల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక అనువర్తనాన్ని అమలు చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నాటికి సర్వేను పూర్తి చేయాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాగూర్ సూచించారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి వీడియో సమావేశం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ఐటిడిఏ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ అనువర్తనం ద్వారా దేశవ్యాప్తంగా గిరిజన కుటుంబాల సామాజిక–ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించి, సంక్షేమ పథకాల అమలుకు ఖచ్చితమైన సమాచారాన్ని సిద్ధం చేయడం లక్ష్యమని తెలిపారు.సర్వే నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించడం, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, గ్రామాల వారీగా కుటుంబాల జాబితా సిద్ధం చేయడం, అంతర్జాల సదుపాయం మరియు మొబైల్ పరికరాల ఏర్పాటు, డేటా నాణ్యత కోసం పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సర్వే ద్వారా గిరిజన కుటుంబాల విద్య, ఆరోగ్యం, నివాసం, ఉపాధి వంటి అంశాలపై సమగ్ర సమాచారం సేకరించి, వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు.సంబంధిత శాఖలు, జిల్లా యంత్రాంగం, క్షేత్ర సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, గిరిజన కుటుంబాలు సరైన వివరాలు అందించి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ప్రత్యేక గిరిజన వర్గాల అధికారి గన్యా, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో పేదలకు కష్టాలు... రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

- - గ్యాస్ లేక కట్టెల కోసం తిరగాల్సిన పరిస్థితి దాపురించింది
- - రైతుబంధు సమయానికి రాక ప్రస్తుతం వచ్చేవి వడ్డీకే సరిపోతున్నాయి
- - సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



**పినపాక,మార్చి 23(ప్రజాజ్యోతి):** గ్యాస్ సరఫరా సమయానికి అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం మరింత పెరిగిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తీవ్రంగా విమర్శించారు. సోమవారం సాయంత్రం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధరలు సాధారణ ప్రజలకు అందని ద్రవ్యంగా మారాయని అన్నారు. ఒకప్పుడు పేదలు కూడా సులభంగా వాడగలిగిన గ్యాస్ ఇప్పుడు భారంగా మారిందని పేర్కొన్నారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ సమయానికి సరఫరా కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మరింత ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టెల కోసం తిరగాల్సిన పరిస్థితి మళ్లీ వచ్చిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటిని అడ్డుకునేలా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా సబ్సిడీలు పెంచాలని, గ్యాస్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై కూడా కనకయ్య తీవ్రంగా స్పందించారు. వరి పంటకు బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చాలా మంది రైతుల ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమ చేయలేదని ఆరోపించారు. రైతుల పక్షపాతిగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.పంట చేతికి వచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలను సమయానికి ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. మధ్యవర్తుల చేతిలో రైతులు దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని అన్నారు.రైతుబంధు పథకం అమలు విషయంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. పంట వేసే సమయంలో అందాల్సిన రైతుబంధు సాయం పంట కోత సమయంలో ఇవ్వడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని చెప్పారు. ఇచ్చిన సాయం కూడా వడ్డీలకు సరిపోని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు.ఇంకా రైతుబంధు ఎన్ని ఎకరాలకు ఇస్తారనే విషయంపై కూడా ప్రభుత్వానికి స్పష్టత లేదని కనకయ్య విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితమైపోయాయని అన్నారు.ప్రభుత్వం వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు యాజమాన్యం తక్షణమే నెరవేర్చాలి

- కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలేనిరాహారదీక్షలు ప్రారంభం

**బూర్గంపహాడ్, మార్చి 23 (ప్రజా జ్యోతి):**సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ అంశాలు పరిష్కరించాలని, 14వ వేతన ఒప్పంద ప్రక్రియను కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ తోనే జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐటీసీ గేటు వద్ద రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. బిఆర్టియు, ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ తదితర ట్రేడ్ యూనియన్ల నాయకులు ఈ రిలే నిరాహారదీక్ష శిబిరంలో పాల్గొని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్, కో–కన్వీనర్లు పాటి సోమిరెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్యలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళన విరమించేదిలేదని, న్యాయమైన కోర్కెలను యాజమాన్యం తీర్చేంతవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఐటీసీ పీఎస్పీడీ పేరుతో పంచ్ కార్డ్ ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు, ప్లాంటేషన్ కార్మికులకు ఇస్తున్న వేతనాలకు అదనంగా రోజుకు రూ.500 ఇస్తూ వేతన ఒప్పందంలో పెంచిన మొత్తం బేసిక్‌లో కలపాలని, కాంట్రాక్టు కార్మికులకు మొత్తం వేతనంపై ఎలాంటి సీలింగ్ లేకుండా 20శాతం బోనస్ ఇవ్వాలని, సీ–4ఎల్, బీ–1ఎల్ గ్రేడ్లు వెంటనే తీసివేయాలని, వీఆర్ఎస్ స్కీం అమలుచేసి ఫైనల్ సెటిల్మెంట్ పునరుద్ధరించాలని, కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ నియామకంలో సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, స్కిల్ మాట్రిక్స్ ప్రతి ఏడాది అమలుచేయాలని, 26 డ్యూటీలు ఇచ్చి వీక్లీ ఆఫ్ కు కూడా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షా శిబిరాన్ని బీఆర్టీయూ నుంచి సానికొమ్ము శంకర్రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, ఏఐటీయూసీ నుంచి సింగంనేని ప్రసాద్, బీఎంఎస్ నుంచి బిజ్జం అశోక్ రెడ్డి, సీఐటీయు నుంచి వెంకటేశ్వర్లు, ఐఎన్టీయూసీ నుంచి యారం పిచ్చిరెడ్డి, గోనె రామారావులతోపాటు జిల్లా స్థాయి నాయకులు, పలు రాజకీయ పార్టీలకుచెందిన నాయకులు కాంట్రాక్టు కార్మిక సంఘ జేఏసీ నాయకులకు సంపూర్ణ మద్దతు తెలిపి వారి సమస్యలు పరిష్కరించేంతవరకు అండగా ఉంటామన్నారు. ఈ రిలేదీక్షా శిబిరంలో జేఏసీ మెంబర్లు వర్లగొండ వీరన్న, సింగారపు సతీష్, కదల వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మేకల శేషమ్మ, రామశెట్టి లక్ష్మి , వీరంరెడ్డి సీతారామిరెడ్డిలతో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.




## పదవ తరగతి పరీక్షా కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

- నిబంధనలు కచ్చితంగా పాటించాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రజా జ్యోతి:**కొత్తగూడెం పట్టణంలో జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ హై స్కూల్, సెయింట్ మేరీస్ హై స్కూల్, బాబు క్యాంపు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరుగుతున్నాయా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. త్రాగునీరు, విద్యుత్, సరైన కూర్చునే ఏర్పాట్లు, గదుల పరిశుభ్రత, ప్రశాంత వాతావరణం వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చోట్ల తక్షణమే మెరుగులు చేర్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయగల వాతావరణం కల్పించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అక్రమాలు లేదా దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో నియమించిన పర్యవేక్షకులు, సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల పారదర్శకతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని, బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకోగా, సింగరేణి కాలరీస్ హై స్కూల్ సహా అన్ని కేంద్రాల్లో శాతం వంద హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.ఈ తనిఖీలలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

- : కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రజా జ్యోతి: జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటల దిగుబడులను గణనీయంగా పెంచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సోమవారం రామవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలి కుంట వ్యాధి నివారణకు సంబంధించి నిర్వహిస్తున్న జాతీయ ఉచిత టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించే గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిసాన్ మేళా సందర్భంగా వ్యవసాయం, కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన వివిధ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి సమగ్రంగా పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల నిర్వహణ విధానాలు, వ్యవసాయ యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలు, నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ మరియు ఆధునిక పద్ధతులను అనుసరించడం అత్యవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులను రైతులు స్వీకరించి ఆధునిక విధానాల ద్వారా ఖర్చులను తగ్గిస్తూ దిగుబడులను పెంచుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రవేత్తల సలహాలు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట మార్పిడి విధానాలను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సంప్రదాయ వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటలు, మిశ్రమ పంటల సాగు, పశుసంవర్ధక రంగాన్ని అనుసంధానం చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపొందించుకోవచ్చని వివరించారు. ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కిసాన్ మేళా నిర్వహించబడిందని, రైతులకు ఒకే వేదికపై ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మేళా ద్వారా రైతులు కొత్త పద్ధతులను నేర్చుకుని వాటిని తమ పొలాల్లో అమలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్, ఉప మేయర్ సిరిపురం లలిత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, త్రీ ఇంక్లైన్ గ్రామ సర్పంచ్ ఈసం ప్రవల్లిక, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త భరత్, ఆత్మ చైర్మన్లు వీరభద్రరావు, బుచ్చిబాబు, బోడా మంగీలాల్, శాస్త్రవేత్తలు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలపై తక్షణ చర్యలు

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి: ఐటిడిఏ పీవో రాహుల్



భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి: వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వ్యక్తిగత సమస్యలు, జీవనోపాధి అభివృద్ధి కోసం గిరిజన దర్బార్ లో దరఖాస్తు చేసిన ప్రతి అర్హ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ ప్రారంభానికి ముందు సంబంధిత యూనిట్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం గిరిజన దర్బార్ కు హాజరైన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపిస్తూ అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనులు సమర్పించిన అర్జీలలో పోడు భూముల సమస్యలు, పట్టాల మంజూరు, పేర్ల మార్పులు, భూ వివాదాలు, వ్యక్తిగత సమస్యలు, జీవనోపాధి కోసం రుణాల మంజూరు, వ్యవసాయ భూములకు విద్యుత్ మోటార్లు, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, జీవన భృతి, సౌర విద్యుత్ కనెక్షన్లు, సాగునీటి కోసం బోర్లు తవ్వించుకునేందుకు అనుమతులు, ఇసుక మరియు మత్స్య సహకార సంఘాల ఏర్పాటు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, వృత్తి శిక్షణలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం వంటి అంశాలు ఉన్నట్లు తెలిపారు. దర్బార్ లో వచ్చిన అన్ని అర్జీలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి ఆన్లైన్ లో నమోదు చేసి, విడతలవారీగా అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు అశోక్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సైదులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మధుకర్, వ్యవసాయ అధికారి సున్నం రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్ కుమార్, అటవీ హక్కుల విభాగం అధికారి లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సిడిపిఓ జ్యోతి, వ్యవసాయ అధికారి నరేందర్, హెచ్ ఈఓ లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణానికి పగడ్బందీ ఏర్పాట్లు

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి: శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణం మరియు పట్టాభిషేక మహోత్సవాల సందర్భంగా విధులు నిర్వహించే అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. సోమవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో జరుగనున్న మహోత్సవాల ఏర్పాట్లపై లైజన్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ, సెక్టార్లకు నియమించబడిన అధికారులు ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేసి తమకు కేటాయించిన ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులు, వీఐపీలు, వీవీఐపీలు బస చేసే గెస్ట్ హౌస్ ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. కళ్యాణం, పట్టాభిషేకం దర్శనానికి వచ్చే భక్తులకు సరైన కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని, అస్వస్థతకు గురైన భక్తులను సమీప వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందించాలని ఆదేశించారు. వీఐపీలు, వీవీఐపీల వెంట వచ్చే సిబ్బంది కారణంగా ఎలాంటి గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహకారంతో పరిస్థితిని నియంత్రించాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే వాకీ–టాకీల ద్వారా కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని తెలిపారు. 27వ తేదీన శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, 28వ తేదీన పట్టాభిషేక కార్యక్రమానికి గవర్నర్ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాలు ఎటువంటి ఆటంకం లేకుండా విజయవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లైజన్ ఆఫీసర్లు పర్యవేక్షణ పగడ్బందీగా ఉండాలని, సెక్టోరియల్ అధికారులు తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచి భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. మహోత్సవాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో భోజన సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఏఎస్ పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఆర్ డీఓ విద్యాచందన తదితర అధికారులు పాల్గొన్నారు.





# 'సెల్ టవర్' నిర్మాణ పనులు అడ్డుకున్న గ్రామస్థులు



బూర్గంపహాడ్, మార్చి 23 (ప్రజా జ్యోతి): సెల్ టవర్ నిర్మాణ పనులను మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు సోమవారం అడ్డుకున్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టాలనే నిర్ణయాన్ని గ్రామప్రజలు వ్యతిరేకించారు. ఆ స్థలంలో కాకుండా గ్రామానికి చివరన ఈ నిర్మాణం చేపట్టాలని, అంగన్వాడీ కేంద్రానికి గర్భిణులు, చిన్నారులు, బాలింతలు నిత్యం వస్తుంటారని, ఈ సెల్ టవర్ నిర్మాణం కారణంగా రేడియేషన్ ప్రభావం ఉండటంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు అడ్డుచెప్పారు. సోమవారం సెల్ టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా టవర్ పునాది పనులను చేపట్టేందుకు యంత్రాలతో వచ్చిన నిర్వాహకులను గ్రామస్థులు అడ్డుకుని పనులను నిలిపివేశారు. జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే ఊరుకునేది లేదని, ఈ ప్రాంతంలో కాకుండా జనావాసాలు లేని చోట టవర్ నిర్మించాలని, ఇక్కడ నిర్మాణం చేపడితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించడంతో నిర్వాహకులు పనులు తాత్కాలికంగా నిలిపివేశారు.

# 7.4 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్టు, ద్విచక్ర వాహనం స్వాధీనం



భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి: భద్రాచలంలోని ఇసుక ర్యాంపు వద్ద సోమవారం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు 7.4 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై చావా శ్రీహరి రావు తన సిబ్బందితో కలిసి భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేని ఒక ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానించి తనిఖీ చేయగా, వారి వద్ద లభించిన బ్యాగుల్లో 7.4 కిలోల ఎండు గంజాయి బయటపడింది. పట్టుబడిన నిందితులను సిద్దిపేట జిల్లా చేర్యాల గ్రామానికి చెందిన బొడ్డు చందు, కూరాకుల రోహిత్ లుగా గుర్తించారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి, చేర్యాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ రూ. 4,90,000 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అలాగే పట్టుబడిన విచారణ నిమిత్తం నిందితులను స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, హరీష్, విజయ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీల్లో నాణ్యమైన మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి: అడిషనల్ పీడీ రమణ



పినపాక, మార్చి 23 (ప్రజాజ్యోతి): నర్సరీల్లో నాణ్యమైన, మేలురకమైన మొక్కలను పెంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) రమణ సూచించారు. సోమవారం ఆయన పినపాక మండలంలో పర్యటించి స్థానిక ఎంపీడీవో వెంకటేశ్వరరావుతో కలిసి పలు గ్రామ పంచాయతీల నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా భూపాలపట్నం, బోటిగూడెం, ఉప్పక, సీతంపేట గ్రామాల నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణ, పంపిణీ విధానాలపై సమగ్రంగా పరిశీలించారు. నర్సరీల్లో మొక్కల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు అందించే మొక్కలు ఆరోగ్యవంతంగా, పర్యావరణానికి అనుకూలంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించడంలో నర్సరీల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు నర్సరీలను సక్రమంగా నిర్వహించి, అవసరమైన మొక్కలను సమయానికి అందించాలని ఆదేశించారు. మొక్కల పెంపకంలో సాంకేతిక పద్ధతులు అనుసరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వీరభద్ర స్వామి, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, ఉప్పాక సర్పంచ్ బాబూరావు, బోటుగూడెం సర్పంచ్ బాపనమ్మ, సీతంపేట సర్పంచ్ శివశంకర్, సెక్రటరీలు అరుణ శ్రీ, చంద్రశేఖర్, అశోక్ కుమార్, జ్యోతి, బోటిగూడెం ఉపసర్పంచ్ కొమరం ధన లక్ష్మి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# కార్పొరేషన్ సమగ్ర అభివృద్ధి లక్ష్యం

- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్
- డివిజన్ ప్రజలు నేరుగా కార్పొరేటర్ కు సమస్యలు తెలియజేయాలి
- డిప్యూటీ మేయర్ లలిత



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 23, ప్రజా జ్యోతి:** కొత్తగూడెం – పాల్వంచ జంట నగరాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కొనసాగుతాయని కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడో గణేష్ అన్నారు. పాలవంచ రెండో డివిజన్లో కార్పొరేటర్ భవిత, డిప్యూటీ మేయర్ లలిత తో కలిసి సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మేయర్ ముందుగా స్థానిక అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం డివిజన్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు , అనంతరం పారిశుద్ధ కార్యక్రమాల సరళిని పరిశీలించారు. సమస్యలపై తక్షణమే స్పందిస్తూ అధికారులకు సూచన చేశారు, ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమస్యల వలయంగా రెండో డివిజన్ ఉందన్నారు. డివిజన్లో పలుచోట్ల నూతనంగా రోడ్లు, డ్రైలైన్లు, వీధి దీపాలు కు సంబంధించిన నూతన కరెంటు లైన్లను ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. ప్రజలు నీటి వృధా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాడు బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా నేడు మనమందరం ఈ బాధ్యతలను స్వీకరించామన్నారు. వార్డ్ ఆఫీసర్లు డివిజన్లోని వీధి దీపాలు సమస్యలను గుర్తించాలన్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ క్షేత్రస్థాయి ఆఫీసర్లు నీరు వృధా పై డివిజన్ ప్రజలకు సూచనలు ఇచ్చి తదుపరి కార్పొరేటర్ల సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ లలిత మాట్లాడుతూ డివిజన్లోని ప్రజలు వారి సమస్యలను నేరుగా కార్పొరేటర్లకు తెలియజేయాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని సమస్యలు రెండవ డివిజన్లో ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెండో డివిజన్ కార్పొరేటర్ భవిత మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డి ఈ శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ రాము, శానిటైజర్ ఇన్స్పెక్టర్ రవి, స్థానిక కాంగ్రెస్ నాయకులు తుమ్మల శివారెడ్డి, ముద్ర బోయిన శ్రీను, ఉన్నం నాగేశ్వరరావు, రాహుల్, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీ , మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి భద్రాచలంలో ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు

- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 23 ,ప్రజా జ్యోతి:** ఈనెల 27న భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ తెలిపారు, సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారని, వేసవికాలం కారణంగా కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన తక్షణమే ప్రథమ చికిత్స కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు, అనంతరం నూతనంగా నియమితులైన ప్రోగ్రాం ఆఫీసర్లను పరిచయం చేసుకొని అభినందించారు. కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ రవిబాబు జిజిహెచ్ ఆర్ ఎం ఓ డాక్టర్ సత్య చైతన్య, డాక్టర్ సాయి కళ్యాణ్ ప్రోగ్రాం ఆఫీసర్, పీవోఎం హెచ్ ఎన్ డాక్టర్ చైతన్య డాక్టర్ రాకేష్, పి ఓ సి హెచ్ ఐ డాక్టర్ ప్రతాప్ , ఐడిఎస్పి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి డ , ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ మధువరన్, డాక్టర్ హరీష్ ప్రోగ్రాం ఆఫీసర్ పి సి పి ఎన్ డి టి,మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్పందన డాక్టర్ రాందాస్ పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

- సిఆర్పిఎఫ్ ఎఫ్ 81 బెటాలియన్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం



**చర్ల, మార్చ్ 23:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం పూసుగుప్పలో సిఆర్పిఎఫ్ ఎఫ్ 81 బెటాలియన్ సిఆర్పిఎఫ్ క్యాంపులో ప్రోగ్రాం ఇన్చార్జి ఎం. అంబర్ సింగ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూసుగుప్ప గ్రామానికి చెందిన నిరుపేదలైన 34 మంది మహిళలకు లిటిల్ కాస్ ఎన్జీవో ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు 30 రోజులపాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లను మహిళలకు అందజేయడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆదివాసీల అభివృద్ధి మా లక్ష్యం అని నిరుపేదలకు ఎప్పుడు సహాయ సహకారాలు అందించడంలో సిఆర్పిఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కంపెనీ కమాండెంట్ టి. సిజ్జు మహిళలు గ్రామ పెద్దలు సిఆర్పి సిబ్బంది పాల్గొన్నారు.


## స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ నూతన భవనానికి స్థల కేటాయింపు



**పాల్వంచ, మార్చి 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం బంద్రుగొండ గ్రామపంచాయతీ పరిధిలో స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ నూతన భవన నిర్మాణానికి గ్రామసభలో మెజార్టీ సభ్యుల తీర్మానంతో స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్ మడివి సురేష్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు.సభాధ్యక్షులు సర్పంచ్ మడివి సురేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారం ఉంటే గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం సైదాబీ, ఏఈఈ (పీఆర్) శ్రీనివాసరావు, ఈసీ పుల్లయ్య, ఉప సర్పంచ్ వెంకట్రావు, గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే...ఆరోగ్యం

- నేడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం




**చర్ల, మార్చ్ 23: (ప్రజా జ్యోతి ):** ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన అంటు వ్యాధి అయిన క్షయవ్యాధి (టీబీ )ని నిర్మూలించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పేందుకు ప్రతి సంవత్సరం మార్చి 24వ తేదీని ప్రపంచ టీబీ దినోత్సవంగా పాటిస్తారు.1882 మార్చి 24న డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికి కారణమయ్యే 'మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియాను కనుగొన్నారు కావున ప్రతి సంవత్సరం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకుంటారు.ఈ ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2030 నాటికి ప్రపంచం టి బి ని అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా భారత దేశం 2025 నాటికే టి బి రహిత దేశంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుని కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు .క్షయ అనేది గాలి ద్వారా వ్యాపించే ఒక అంటువ్యాధి ఇది ప్రధానంగా మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బాక్టీరియా వల్ల వస్తుంది చాలా తరచుగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. ఊపిరితిత్తుల క్షయ ఉన్న వ్యక్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా ఉమ్మినప్పుడు ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఒక వ్యక్తికి ఈ వ్యాధి సోకడానికి కొన్ని సూక్ష్మక్రిములను పీల్చితే వ్యాధి వ్యాపిస్తుంది అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. టీబీపై అవగాహన కల్పించడం, రక్షణ, చికిత్స విషయాలను అందరికి తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశం.క్షయవ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స చేయవచ్చు అని వ్యాధికి చికిత్స చేసేటప్పుడు టి బి జాతి కూడా ముఖ్యమైనది అని ప్రారంభంలో టి బి చికిత్సలో యాంటీబయాటిక్స్ తీసుకోవడం ఉంటుంది అని టీబీ ప్రభావం అధికంగా ఉంటే దాదాపు తొమ్మిది నెలల పాటు రోగులు అనేక ఔషధాలను తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ, టి బి డ్రగ్–రెసిస్టెంట్ స్ట్రెయిన్ ఉన్న రోగులకు చికిత్స మరింత క్లిష్టంగా మారుతుందని ఇప్పుడు క్షయను గుర్తించడానికి అధునాతన పద్దతులు అందుబాటులోకి వచ్చాయి అని వైద్యులు సూచిస్తున్నారు.ప్రభుత్వం టిబి రోగులకు ఉచితంగా పరీక్షలు మందులు అందిస్తున్నందున ప్రజలు వాటిని వినియోగించుకోవాలని అలాగే చికిత్సను మధ్యలో ఆపకుండా పూర్తి చేయడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు .టిబి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రజల సహకారం అవగాహనతోనే ఈ లక్ష్యం సాధ్యమవుతుందని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి ఆలయంలో మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాలు అభిషేకాలు,

- అన్నదానంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 23,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయం మొత్తం భక్తి పరవశంతో మార్మోగింది.శివారాధనలో అభిషేకాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఉదయం వేళల నుంచే పాలు, పెరుగు, తేనె, చక్కెర, నెయ్యి వంటి పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. బిల్వదళాలతో పూజలు చేయడం శివునికి అత్యంత ప్రీతికరమని భావిస్తారు. రుద్ర పారాయణం, లింగాభిషేకం ద్వారా భక్తులు తమ కోరికలను వ్యక్తం చేస్తారు. శివుని దర్శనం ఆధ్యాత్మిక శాంతిని కలిగిస్తుందని భక్తుల నమ్మకం. ఉపవాసంతో శివార్చన చేయడం ద్వారా శ్రేయస్సు కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శివ నామ స్మరణతో మనసుకు ప్రశాంతత లభిస్తుంది.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. బత్తుల లక్ష్మణరావు, రమాదేవి కుమారులు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు మహాప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరించారు.

# సింగరేణిని కాపాడుకుందాం

- 30న సేవ్ సింగరేణి జాతను, హెడ్ఆఫీస్ ఎదుట జరుగు మహా ధర్నా
- విమర్శలు చేయడం మాని ఉద్యమానికి కదలిరండి
- ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్యా




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 23 – ప్రజాజ్యోతి:**కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి ఏర్పాటు చేసిన సేవ్ సింగరేణి పోరు జాత పై కొన్ని కార్మిక సంఘాలు విమర్శలు చేయడం సరైంది కాదని, సంఘీభావం తెలిపి కార్మికుల ఐక్యతను చాటాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య పేర్కొన్నారు. సోమవారం శేషగిరిభవన్ లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై ఏఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల ను పరిష్కారం చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి రావాల్సిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి కొత్త గనులు ఇవ్వడం లేదని, దీని వల్ల ఉన్న బొగ్గు గనులు మూత పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. సంస్థ కు బకాయిలు వస్తేనే అన్ని కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని వారు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కావడం లేదనే ఏఐటియుసి సేవ్ సింగరేణి జాతా పోరాట కార్యక్రమం తీసుకుందని వారు పేర్కొన్నారు. ఈ జాతా పై ఐఎన్టీయుసి, సిఐటియు, హెచ్ ఎం ఎస్ యూనియన్ లు కార్మిక వర్గాన్ని బలహీన పరిచే విధంగా, ఐక్యతను దెబ్బ తీసే విధంగా విమర్శలు చేయడాన్ని వారు ఖండించారు. కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, సంస్థ పరిరక్షణ కోసం చేస్తున్న ఇట్టి జాతా కు సంఘీభావం తెలపకుండ కార్మిక వర్గాన్ని తప్పు దోవ పట్టించడమేనని వారు పేర్కొన్నారు. పోరు జాతా లో సింగరేణి కార్మికులకు చెందిన డిమాండ్ లు ఉన్నాయని, వాటి పరిష్కారానికి పోరాట కార్యక్రమం తీసుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ జాతా ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు వంట వార్పు, ముట్టడి కార్యక్రమం ఉంటుంది దీనిని విజయవంతం చేయాలని వారు కోరారు. యాజమాన్యం , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారం చూపకుంటే ఎప్రిల్ లో సమ్మె కు పిలుపు నిస్తామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సముద్రాల సుధాకర్,సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్,నితిన్, టి నాగయ్యా, అనంతలక్ష్మి, జె రమేష్, నరేష్, మల్లికార్జున్, భరణి, కమల్,బండారి మల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ప్రగతిశీల యువజన సంఘం( పివైఎల్ )




**టేకులపల్లి,మార్చి23, ప్రజాజ్యోతి:** విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలనిపి వైఎల్ మండల అధ్యక్షుడు కోడం రవి అన్నారు. భగత్ సింగ్ 95వ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి కాగడాల ప్రదర్శన నిర్వహిం చారు. అనంతరం బోడు రోడ్డు కూడలిలో పివైఎల్ మండల కోడం రవి ఆధ్వర్యంలో నిర్వహించిన కాగడాల ప్రదర్శన కు పివైఎల్ టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి సతీష్,ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ లు పాల్గొన్ని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ కన్న కలలను యువత నిజం చేయాలని వారి ఆశయ సాధనలో ముందుకు వెళ్లాలని వారు పిలుపునిచ్చారు.విదేశీ సంస్కృతికి, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించాలని అన్నారు.భారత దేశ ప్రధాని యుద్ధాన్ని ఖండించాలని యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ యుద్ధం వలన నిత్యవసర వస్తువులు గ్యాస్ పెట్రోలు డీజిల్ తదితర ధరలు పెరిగి అవకాశం ఉందని దీనితో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. యుద్ధం విషయంలో భారత పాలకులు స్పష్టమైన వైఖరి కలిగి ఉండాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో ఎట్టి ప్రశాంత్,మేకల వినోద్ చిరంజీవి మహేష్. క్రాంతి కుమార్, విరాట్ ,తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు నిజ నివాళి అంటే పోరాటమే: సిఐటియు



**కొత్తగూడెం, మార్చి 23 ( ప్రజాజ్యోతి )**భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కన్వీనర్ భూక్య రమేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ త్యాగాలు యువతకు ఆదర్శమని అన్నారు. దేశంలో మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్ల శ్యామ్‌కుమార్, గూగులోత్ సక్రాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తపై కఠిన నిఘా... ఫ్లెక్సీల ఏర్పాటు



**దమ్మపేట,మార్చి. 23(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. చెత్త వేయబడుతున్న ప్రదేశాలను గుర్తించి జేసీబీతో శుభ్రపరిచి, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. అదే ప్రాంతాల్లో "ఇక్కడ చెత్త వేయరాదు" అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులకు అవగాహన కల్పించారు. రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయరాదని సూచించారు. చెత్త వేస్తే రూ.500 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చెత్త కారణంగా దుర్గంధం, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు.చెత్త వేయబడుతున్న స్థలాల యజమానులు తమ ప్రదేశాలకు రక్షణగా మెష్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్లలోనే వేయాలని ప్రజలను కోరారు.తదనంతరం బంజారా కాలనీ చెరువు కట్ట మార్గంలోని డ్రైనేజీ పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. కాలనీలో మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించి మరమ్మత్తులపై ఆదేశాలు ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల పరిసరాల శుభ్రత పనులను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, రూపా రాంబాబు, బత్తుల సాయి, దాసరోజు సరిత రామారావు, బద్దె వెంకటలీల, పసుమర్తి కుసుమాంబ, గ్రామస్తులు ధర్మాసోతు నరేష్, పగడాల గోపి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ , రాజ్ గురు, సుఖదేవ్ లా స్ఫూర్తిని వెలుగెత్తి చాటుదాం

- పిడిఎస్ యు. పి వై ఎల్



**గుండాల మార్చ్ 23. ప్రజా జ్యోతి.** అమరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల స్ఫూర్తిని వెలుగెత్తి చాటుదామంటూ పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్ లు పిలుపునిచ్చారు సోమవారం మండల కేంద్రంలో 23 24 25 తేదీలలో నిర్వహిస్తున్న స్ఫూర్తి యాత్ర ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల స్ఫూర్తితో సామ్రాజ్యవాద అమెరికా చర్యలను నిరసిస్తూ, ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తందారి విధానాన్ని వ్యతిరేకంగా పో రాడాలన్నారు భారత్ అమెరికాతో చమురు వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ, ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఆపాలని, ప్రపంచ శాంతిని వెలుగెత్తి చాటాలని, కోరారు ప్రపంచ శాంతిని చాటుతూ ఐక్యంగా పోరాడాలన్నారు. విద్య ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని అన్నారు రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలను పూర్తిగానిషేధించాలని కోరారు విద్యా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి విద్యారంగాన్ని కాపాడాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. మాస్ లైన్ మండల కార్యదర్శి కొ మరం శాంతారావు, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు మంగయ్య వీరభద్రం శివ ప్రశాంత్ శ్రావణి వాసు అఖిల్ మోహన్ రావు ధర్మరాజు పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ కమిటీ స్టేట్ చైర్మన్‌గా బండిపల్లి కిరణ్‌కుమార్



**కొత్తగూడెం, మార్చి 23 ( ప్రజాజ్యోతి ):** హ్యూమన్ రైట్స్ ప్రజాహిత మానవ పరిరక్షణ కమిటీ స్టేట్ చైర్మన్‌గా బండిపల్లి కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నేషనల్ చైర్మన్, డైరెక్టర్ అల్లం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నేషనల్ డైరెక్టర్ అలెం రమ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేషనల్, స్టేట్, జిల్లా స్థాయి సభ్యులు కిరణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రజాహిత కార్యక్రమాలను విస్తరింపజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ మరింత చురుకుగా పనిచేసి ప్రజలకు న్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ డైరెక్టర్ జారే బిక్షం, సింగపల్లి అప్పారావు, దూడపాక శివప్రసాద్, మరియమ్మ, విజయ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



**కొత్తగూడెం, మార్చి 23 ( ప్రజాజ్యోతి )**భారత స్వాతంత్ర్య సమర యోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో 50వ డివిజన్ లో కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ ప్రముఖ యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత పోషకాహార భోజన పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమలాపురం సత్యనారాయణ మాట్లాడుతూ యువ విప్లవ వీరుడు భగత్ సింగ్ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఎంతో చిన్న వయసులోనే దేశ స్వేచ్ఛ కోసం ఉరికంబాన్ని నవ్వుతూ ఎక్కి ప్రాణత్యాగం చేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. రామారావు, సాయి, వై. సుందరమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు సార్వభౌమ సేవ

- రామాలయంలో ఆపదుద్దారక స్తోత్ర పారాయణం





**భద్రాచలం, మార్చి 23, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సోమవారం సార్వభౌమ సేవ నిర్వహించారు. ఈ సమయంలో సార్వభౌమ వాహనంపై ఆసీనులను చేసి తిరువీధి సేవను వేద మంత్రోచ్చారణల నడుమ సాగగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే రామాలయంలోని నిత్యకల్యాణ మండపం వద్ద ఆపదుద్దారక స్తోత్ర పారాయణంను రామాలయ వైదిక, పరిపాలన ఉద్యోగులు, సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. రామాలయంలో అనాధిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలు కొనసాగాలని, భవిష్యత్తులో నిర్వహించే పూజలు, యజ్ఞయాగాదికాలకు ఎటువంటి ఆటంకం కలగకూడదని, లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## గుండెపోటుతో రాజు కంప్యూటర్స్ అధినేత రాజు మృతి



**మణుగూరు క్రైమ్, మార్చి 23, (ప్రజాజ్యోతి ):** మండలంలోని మున్సిపాలిటీ పరిధిలోగల గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రాజు కంప్యూటర్స్ అధినేత ఓబులాపురం రాజు సోమవారం ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందడంతో విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని వేణు రెస్టారెంట్ సమీపంలో ఉన్న తన కంప్యూటర్ సెంటర్‌లో ఉండగానే ఆయనకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం. రాజు మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## భగత్‌సింగ్ వర్ధంతి.. అమరవీరుల త్యాగాలు స్మరణ



**దమ్మపేట,మార్చి. 23(ప్రజాజ్యోతి):** దేశ స్వాతంత్ర్యానికి తమ ప్రాణాలను తృణ ప్రా యంగా అర్పించిన అ మరవీరులు భగత్‌సిం గ్, రాజ్‌గు రు, సుఖదేవ్ లను స్మరించుకోవాల ని సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు పిలుపు నిచ్చారు. సోమవారం దమ్మపేటలోని సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనను తరిమికొట్టడమే కాకుండా అన్ని రకాల పీడనలకు ముగింపు పలకడం ద్వారానే నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని భగత్‌సింగ్ భావించారని తెలిపారు. ఆయన ఆలోచనలు నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఆదినారాయణ, యశోద, శ్రీను, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ట్రాఫిక్ తో నిత్యం... రద్దీనే..!

- రోడ్డును ఆక్రమిస్తున్న కూరగాయల బండ్లు...
- వ్యాపార సముదాయాలున్న రోడ్డుమీదనే అమ్మకాలు
- ఇబ్బందులు పడుతున్న వాహన దారులు...

**ఇక్కడ అసలే ట్రాఫిక్ సమస్య ఆ పై ఉన్న రోడ్డున సైతం తోపుడుబండ్ల పై వ్యాపారాలు చేసేవారు ఆక్రమించడంతో ప్రతి రోజు ఆ ప్రాంతంలో తీవ్రట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రపురం వెళ్లే ప్రధాన రహదారి రద్దీగా మారుతుంది అదేవిధంగా కొత్తగూడెం చిన్న బజార్ పెద్ద బజారుకు వెళ్లేవారు కూడా ఇదే మార్గంలో వెళ్లడం పెద్ద బజారుకు సరుకులు తీసుకొచ్చే లారీలు కూడా ఎటువైపు నుంచి వెళుతుండడం ఇతర భారీ వాహనాలు ర్యాలీలు ఆటోలు ఇలా అన్ని వాహనాలు ఇదే దారిలో వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.**

- లక్ష్మీదేవిపల్లి, ప్రజాజ్యోతి

### ››› రోడ్డును ఆక్రమిస్తున్న కూరగాయల బండ్లు...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి హచంద్రాపురం వెళ్లే రహదారి రోజూ ట్రాఫిక్‌తో నరకంగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయల బల్లలు పెట్టడం వల్ల వాహనాలు వెళ్లేందుకు సరైన స్థలం లేక తీవ్ర రద్దీ నెలకొంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హేమచంద్రాపురం వెళ్లే ప్రధాన రహదారి రోజురోజుకీ ట్రాఫిక్ సమస్యతో కుదేలవుతోంది. రోడ్డుపక్కన అనధికారికంగా కూరగాయల బల్లలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆటోలు, బైకులు, కార్లు ఒకేసారి రావడంతో రహదారి పూర్తిగా స్తంభించిపోతుంది.

### ››› ఇబ్బందులు పడుతున్న వాహన దారులు...

స్థానికుల మాటల్లో చెప్పాలంటే, "రోడ్డు మీదే బజార్ పెట్టేసినట్టుగా పరిస్థితి ఉంది. ఎప్పుడైనా అంబులెన్స్ లేదా అత్యవసర వాహనం వస్తే వెళ్లేందుకు కూడా మార్గం ఉండదు" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు పాదచార మార్గాలు, రహదారులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు పక్కన వ్యాపారాల వల్ల పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని పలు నివేదికలు కూడా చెబుతున్నాయి.

### ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి :

**సామాజిక బిసి సంఘం జిల్లా నాయకులు మాచర్ల అనిల్**



నిత్యం రద్దీగా మారుతున్నా కొత్తగూడెం – హేమచంద్రాపురం రహదారి సమస్య పరిష్కరించాలని సామాజిక బిసి సంఘం జిల్లా నాయకులు మాచర్ల అనిల్ కోరారు. వెంటనే చర్యలు తీసుకుని రైల్వే స్టేషన్ రోడ్డును ఆక్రమణల నుంచి ఖాళీ చేయాలని, లేదంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనలో నిర్లక్ష్యం వద్దు

- అధికార యంత్రాంగం మేల్కొనాలి
- ప్రజల్లో అవగాహన లోపం గ్రామ స్థాయిలో చర్యలు అత్యవసరం
- ఉచిత పరీక్షలు, చికిత్స ఉన్నా విని యోగం తగ్గడం ఆందోళనకరం

**కొత్తగూడెం, మార్చి 23 ( ప్రజాజ్యోతి ):** క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకునే వరల్డ్ ట్యూబర్క్యులోసిస్ డే నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల్లో అవగాహన పెంపు అత్యవసరంగా మారింది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో క్షయవ్యాధి లక్షణాలపై సరైన సమాచారం లేకపోవడం వల్ల అనేక మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నప్పటికీ చాలామంది వైద్యులను సంప్రదించడం లేదు. వ్యాధి తీవ్రరూపం దాల్చడంతో పాటు ఇతరులకు వ్యాప్తి చెందే ప్రమాదం పెరుగుతోంది.

### గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి

ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు వివరించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, గ్రామ సభలు, సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితాం సాధ్యమవుతాయి.

### ఉచిత సేవలు అందుబాటులో ఉన్నా వినియోగం తక్కువ

ప్రభుత్వం క్షయవ్యాధి నిర్ధారణకు పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందిస్తున్నప్పటికీ అవగాహన లోపం వల్ల ప్రజలు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు క్షేత్ర స్థాయి లో పర్యవేక్షణ లోపించడం అనుమానిత కేసులను వెంటనే గుర్తించకపోవడం వంటి కారణాలతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంబంధిత శాఖలు కేవలం ఆదేశాలకు పరిమితం కాకుండా, అమలు పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవాలంటే అధికారులు చురుకైన చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. ప్రతి కేసును గుర్తించి పూర్తి చికిత్స అందేలా పర్యవేక్షిస్తేనే వ్యాధిని పూర్తిగా అదుపులోకి తీసుకురావచ్చు. ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకునే వరల్డ్ ట్యూబర్క్యులోసిస్ డే నేపథ్యంలో ప్రజాజ్యోతి దినపత్రికలో ప్రత్యేక కథనం.

